క్లుప్తంగా

యాచారం జంగయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్

చింతపల్లి: మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యాచారం జంగయ్య సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శనివారం గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందడంతో ఆదివారం ఆయన అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జంగయ్య కృషి చేశారన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు.ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు దొంతం సంజీవరెడ్డి, ఎరుకలి వెంకటయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీయాచారం యాదయ్య గౌడ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : అనుముల మండలంలోని ముక్కమాల గ్రామానికి చెందిన గోనె శ్రీపతిరావు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ వేర్వేరుగా ఆదివారం బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోనె శ్రీపతిరావు మృతదేహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోనె శ్రీనివాస్‌రావు, నాయకులు గోనె నరేందర్‌రావు, కిలారి కృష్ణయ్య, జానయ్య, వెంకటేశ్వర్లు, స్వామిరావు, వెంగల్‌రావు, సీఐ గోనె సురేష్, గోనె ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

చింతపల్లి: మండల పరిధిలోని కుర్మేడ్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ బుర్రి వెంకటయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని కార్యకర్తలను కాపాడుకోవడంలో విఫలం చెందానని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉపాధ్యాయుడికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు




అవార్డు అందుకుంటున్న బాలరాజు

డిండి: మండల పరిధిలోని వావిల్‌కోల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజు హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళా నిలయం వారు అందించిన గురుబ్రహ్మ లైఫ్‌టైం అచీవ్‌మెంట్(జీవిత సాఫల్య పురస్కారం) అవార్డు శనివారం అందుకున్నారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన బాలరాజు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 14 పురస్కారాలు అందుకున్నాడు. బాలరాజు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం పట్ల పలువురు ఆదివారం హర్షం వ్యక్తం చేసారు.

దుండగులను శిక్షించాలి

డిండి: భూదాన్‌పోచంపల్లిలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం కుడి చేయిని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి శిక్షించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముదిగొండ ఏలేష్ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి పాల్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసారు.

ఆంజనేయ సన్నిధానం నిర్మాణానికి కృషి



బోరు ప్రారంభిస్తున్న భక్తులు

చింతపల్లి : మండలంలోని ఆంజనేయ సన్నిధాన నిర్మాణానికి కృషి చేస్తానని ఏకుల రవి అన్నారు.చింతపల్లి మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి సన్నిధానం నిర్మాణం కోసం రవి దంపతులు బోరు మోటారు ఏర్పాటు చేసి ఫిట్టింగ్ చేయించారు. కార్యక్రమంలో హనుమాన్ శక్తి జాగరణ అధ్యక్షుడు కడారి రవి, అయ్యప్ప గురు స్వామి చిన్నమోని రాములు గొడుగు శ్వేత శ్రీనివాస్, యాదవ్ ఏరుకొండ సైదులు, సతీష్ పాల్గొన్నారు.

సర్కార్ బడులకు 'వెలుగు'లు

- ఇటీవల జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- తప్పనున్న విద్యుత్ బిల్లుల భారం
- సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 324 ప్రభుత్వ పాఠశాలలు
- వచ్చే నెల నుంచి అమలు



చల్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

హాలియా : సర్కార్ బడుల్లో ఇక ఉచిత విద్యుత్ వెలుగులు. కరెంట్ బిల్లులు పాఠశాలలకు గుదిబండగా మారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఆర్థిక భారం తప్పనుంది. పాఠశాలల నిర్వహణకు వచ్చే నిధుల్లో సగానికి పైగా విద్యుత్ చార్జీల చెల్లింపులకే సరిపోయేది. దీంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. చాలా పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం వీటిని దృష్టిలో పెట్టుకుని విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల జీఓ కూడా జారీ చేసింది. వచ్చే నెల నుంచి ఉచిత విద్యుత్ బిల్లులు వచ్చేలా ట్రాన్స్‌కో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చాలీచాలని గ్రాంట్‌తో..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు రూ. 10వేల నుంచి రూ. 75వేల వరకు చెల్లిస్తుంది. 50వేలు అంతకన్నా ఎక్కువ నిధులు వచ్చే పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. వచ్చే నిధులు కూడా రెండు దఫాలుగా చెల్లిస్తుంటుంది. వీటితో స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, ఇంటర్నెట్ చార్జీలు, చిన్న, చిన్న మరమ్మతులు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ విద్యుత్ బిల్లులు, తాగునీరు నిర్వహణకు ఖర్చు చేయాలి. సరిపడా నిధులు లేకపోవడంతో చాలా చోట్ల హెచ్‌ఎంలు సొంతంగా భరించాల్సి వచ్చేది. చాలా పాఠశాలల్లో రూ. వేలల్లో విద్యుత్ బకాయిలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఇకపై పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా కానుండడంతో కొంతమేర ఉపశమనం కలగనుంది.

ప్రభుత్వ నిర్ణయంతో..

సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు కలుపుకుని 324, కేజీబీవీలు 7, మోడల్ స్కూల్స్ నాలుగు, గురుకులాలు నాలుగు ఉన్నాయి. వీటిలో సుమారు 15 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. బోరు మోటరు, ప్రయోగశాలలు, ఫ్యాన్లు, డిజిటల్ తరగతి గదులు, ప్రొజెక్టర్లు వంటివి ఉపయోగిస్తున్నారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. పాఠశాలల స్థాయిని బట్టి నెలకు రూ. 2వేల నుంచి రూ. 3వేల వరకు బిల్లులు వస్తున్నాయి. మోడల్ స్కూళ్లు, కేజీబీవీలకు, ఇతర గురుకులాలకు రూ. 4వేల నుంచి 6వేలకుపైగా వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాఠశాలలకు విద్యుత్ భారం తగ్గనుంది.

విద్యుత్ సరఫరాకు ప్రత్యేక వెబ్‌సైట్..

పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ప్రత్యే వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా యాడ్, డిలీట్, ఎడిట్ ఆప్షన్లు కల్పించనున్నట్లు సమాచారం. పాఠశాలలకు వచ్చే బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రతి నెలా వచ్చే బడ్జెట్‌లో డిస్కంలకు చెల్లించాల్సి ఉంటుంది. పాఠశాలల వారీగా వచ్చే విద్యుత్ బిల్లుల వివరాలు వెబ్‌సైట్ అందుబాటులో ఉండనున్నాయి.

తీరనున్న విద్యుత్ వెతలు

నిధులను విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ప్రభుత్వం అందజేస్తుంది. ఇందులోనే విద్యుత్ బకాయిలకు చెల్లించాల్సి వస్తుండటంతో హెచ్‌ఎంల పాలిట బిల్లులు గుదిబండగా మారింది. వచ్చే కొద్దిపాటి నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో ఉచిత విద్యుత్ కల సాకారమైంది.

–బాలునాయక్, మండల విద్యాధికారి, అనుముల మండలం

పేదలకు అండగా ఉండాలి : ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: కుల సంఘాల భవనాలు పేదలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని షాబునగర్‌లో నిర్మించనున్న గౌడ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి మాట్లాడారు. గౌడ కులస్తులందరు కలిసికట్టుగా ఐకమత్యంతో ఉండాలని అన్నారు. భవన నిర్మాణానికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కుల సంఘాల భవనాలు కేవలం మీటింగ్‌ల కోసమే కాకుండా సంఘంలోని పేద కుటుంబాలకు అండగా ఉండి వారి వివాహాలకు, శుభకార్యాలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో గుండు శ్రీరాములుగౌడ్, జెర్రిపోతుల రాములుగౌడ్, వెంకటేష్‌గౌడ్, ఉదయ్‌భాస్కర్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి విగ్రహం ఆవిష్కరణ



రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు బొమ్మరబోయిన రామారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, బండి వెంకటేశ్వర్లు, పాలు నాగార్జున, కందుల నాగిరెడ్డి, కొర్ర కాంతి కృష్ణకాంత్‌నాయక్ తదితరులున్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త గువ్వల పెద సైదయ్య ఇటీవల మృతి చెందాడు. అయితే పార్టీ కార్యకర్త చేసిన ఇన్సూరెన్స్ రెండు లక్షల రూపాయల చెక్కును ఆయన కుటుంబ సభ్యులు గువ్వల లక్ష్మమ్మకు మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎఎంసీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, మాజీ జెడ్పీటీసీలు కుర్ర సేవ్యానాయక్, అంగోతు లలిత హాతిరాంనాయక్, నాయకులు కొత్త మర్రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, పాలు నాగార్జున, సింగన్న, మధు, శ్రీను, చిన్నా, నాగరాజు, వినోద్ తదితరులున్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

త్రిపురారం : అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుదాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండంలోని పెద్ద దేవుల పల్లి గ్రామంలో సీపీఎం 18వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ జమిలి ఎన్నికలు తీసుకరావడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రైవేట్ విధానాలను అనుసరిస్తూ రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, గనులు, భూములు, అడవులు, సహజ వనరుల మొత్తాన్ని విదేశి పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి దైద శ్రీను, చందనబోయిన సుదాకర్, చందనబోయిన లక్ష్మయ్య, సింగం సైదులు, అంజయ్య, రామకృష్ణ, మల్లయ్య, బిక్షం, వెంకటయ్య, వెంకట్రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాగరాజు

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని ఆ పార్టీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శి ఉబ్బపల్లి నాగరాజు కోరారు. ఆదివారం పట్టణంలోని 34వ వార్డు గాంధీనగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించి ఏ ఒక్కటి కూడా సరిగా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, బొట్టు సోములు, ఉబ్బపల్లి నాగార్జున, దైద సోములు, మహేష్, కృష్ణ, కొండలు, ప్రసాద్, శ్రీను, ప్రదీప్ తదితరులున్నారు.

108 సర్వీస్‌లో ఉత్తమ అవార్డు

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన బొంగర్ల మహేష్ 108 సర్వీస్‌లో రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. ఆదివారం నకిరేకల్‌లో నిర్వహించిన సమావేశంలో సోమేష్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న సోమేష్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మధు ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ: గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మండల గురుకుల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పాత సమయ వేళలుగా ఉన్న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు మార్చాలని కోరారు. ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు, హెల్త్‌కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బక్క శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు రాంబాబు, రవికిరణ్, మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, అడావత్ చిన్న, వెంకన్న, అంజయ్య, మధుసూదన్, స్వప్న, స్వాతి, శృతి, శ్రీదేవి, సైదులు, అమరయ్య పాల్గొన్నారు.

సంఘ సభ్యుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదు



మాట్లాడుతున్న రమావత్ దస్రూనాయక్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి బంజార సేవా సంఘం సభ్యుల మధ్య పార్టీల పేరుతో చిచ్చు పెట్టడం సరి కాదని సంఘం జిల్లా నాయకుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో బంజార సేవా సంఘం అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి రావాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన కొందరు నాయకులు కావాలని మిగతా వారిని పక్కన పెట్టడం సరికాదని అన్నారు. 2017 నుంచి మండల కేంద్రంలో బంజార సంఘం భవన నిర్మాణానికి అందరం కలిసికట్టుగా పని చేశామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మండల నాయకులు

చందంపేట : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను చందంపేట మండల యువ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ స్థితిగతులను కేటీఆర్‌కు వివరించినట్లు బీఆర్ఎస్ మండల నాయకుడు అప్పల శ్రావణ్, గుండె పవన్ గౌడ్‌గ తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బోయపల్లి హరీష్ తదితరులున్నారు.

చింతరెడ్డి వెంకట్‌రెడ్డికి నివాళి

హాలియా : అనుముల మండలంలోని హజారిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి చింతరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆదివారం గ్రామంలో జరిగిన చింతరెడ్డి వెంకట్‌రెడ్డి దశ దినకర్మకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా చింతరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బంజార సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పలు గ్రామాల బంజార కార్యకర్తలు ఆదివారం మార్కెట్‌యార్డులో సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా రమావత్ లాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ సురేష్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ మండల బంజార సేవా సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జానిగానితండాలో తాగునీటి ఇబ్బందులు

- వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు



బోరు నీటిని పట్టుకుంటున్న తండావాసులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని జానిగానితండా వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మర్రిగూడ మండలం లింగోటం నుంచి మిషన్ భగీరథ నీరు రివర్స్ రావడం, గ్రామంలోని ట్యాంకర్‌లోకి నీరు ఎక్కకపోవడం తదితర కారణాలతో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. దీంతో చేసేది లేక వ్యవసాయ బావుల వద్ద నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామ మాజీ సర్పంచ్ రమావత్ రమేష్‌నాయక్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన పగిడిమర్రి వెంకటేశ్వర్లు, కుమారి దంపతులుకొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారు. వెంకటేశ్వర్లుకు ఇటీవల గుండె ఆపరేషన్ కాగా, మరలా పక్షవాతం రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. నెల నెల మందుల కొనుగోళ్లకు కూడా లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న విబిఎస్ ఫౌండేషన్ చైర్మన్ దాసరి నినస్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రాకం శైలేందర్, అలుపురి రామకృష్ణ, కారంపూడి శివ, మని ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు సరికాదు

గుర్రంపోడు: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఆదివారం గుర్రంపోడు పోలీసు స్టేషన్ ఎదుట కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. మొసంగి గ్రామానికి చెందిన చంటి అనే వ్యక్తి భూమి విషయంలో పెద్ద మనిషిగా వెళితే అక్రమ కేసు బనాయించడంతోపాటు కోర్టులో కేసు ఉన్నప్పటికీ పొలంలో కంచె పాతించి అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు.

పదహారేళ్లకు ఒకే వేదికపై..



గురువులతో పూర్వ విద్యార్థులు

- ఆత్మీయ పలకరింపుతో సంతోషంగా గడిపిన పూర్వవిద్యార్థులు

పెద్దవూర: ఐదేళ్లో.... పదేళ్లో కాదు... ఏకంగా పదహారేళ్లకు కలుసుకున్నారు.. ఎప్పుడో బడి రోజుల్లో విడిపోయిన వారంతా మళ్లీ ఇన్నాళ్లకు ఒక్కటయ్యారు. పెద్దవూర మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2007 – 8లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకకు ఎక్కడెక్కడో స్థిరపడ్డ చిన్ననాటి స్నేహితులంతా తరలివచ్చారు.

యోగక్షేమాలు తెలుసుకొని...

బాల్యమిత్రులంతా ఒక్కచోట చేరడంతో అందరూ చిన్నపిల్లలుగా మారి సందడి చేశారు. బడిలో చేసిన అల్లరి, ఇతర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలు తెలుసుకొని... అపురూప క్షణాలను సెల్‌ఫోన్లో బంధించుకున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

అరే జగదీశ్.. దిలీప్, చంద్రశేఖర్...ఎంత మారిపోయారురా.. ఏంరా శ్రీను నువ్వు గొప్పోడివయ్యావట కదరా... మస్తు మారినవ్‌రా గర్వంగా ఉందిరా అంటూ ఆత్మీయంగా వారు ఆలింగనం చేసుకున్నారు. మిగతా మిత్రులు కూడా వారితో కలిసి ఎన్నాళ్లకెన్నాళ్లకు కలుసుకున్నాం రా అంటూ వారంతా ఆత్మీయత చాటుకున్నారు. అనంతరం గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో నాటి పాఠశాల హెచ్‌ఎం కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యాయులు కర్నాటి మునిరెడ్డి, లక్ష్మారెడ్డి, గుంటుక రామాంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరెడ్డి, శంకరాచారి, సాలోమి, రాములు, పూర్వ విద్యార్థులు జగన్, దిలీప్‌రెడ్డి, చంద్రశేఖర్, లాలు, అంజి, వెంకట్‌రెడ్డి, శ్రీను, అనూష, రాణి, పద్మ, శ్వేత, శ్రీలత పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాముల కలకలం !

- కార్యాలయ సెక్షన్ గదుల్లోకి తరచూ వస్తున్న సర్పాలు
- విధులు నిర్వహించేందుకు జంకుతున్న సిబ్బంది



నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయం




పేరుకుపోయి చెత్త, పిచ్చి మొక్కలు

చందంపేట : నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయంలోని సెక్షన్ ఆఫీసర్ల గదుల్లోకి పాములు అతిథులుగా వచ్చిపోతున్నాయి.. సొంత భవనం లేకపోవడంతో గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంలో తాత్కాలికంగా నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల పాములు కార్యాలయంలోకి వస్తుండడంతో సిబ్బందితో పాటు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సైతం హడలెత్తిపోతున్నారు. ఎటువైపు నుంచి ఏ పాము వస్తుందోనని వణికిపోతున్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం

గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలలో తాత్కాలికంగా కొనసాగుతున్న నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయ సెక్షన్ గదులకు పాముల భయం పట్టుకుంది. ఈ గదులలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఈ సెక్షన్ గదుల్లో విధులు నిర్వహిస్తుంటారు. సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరగడంతో విషకీటకాలకు స్థావరంగా మారాయి. దీంతో విషసర్పాలు కార్యాలయంలోకి వస్తుండడంతో సిబ్బంది స్వేచ్ఛగా విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. కనీసం సిమెంట్ ప్లాస్టింగ్ కూడా చేయని కార్యాలయ భవనం చూసే ఓ శిథిలావస్థ భవనంలా కనిపిస్తుంది. దీంతో ఇందులో విధులు నిర్వహించాలంటే సిబ్బంది జంకుతున్నారు.




సెక్షన్ గదుల్లో నాగుపాము

పదిహేను రోజుల వ్యవధిలో ..

నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయ సెక్షన్ గదులలో పదిహేను రోజుల వ్యవధిలోనే మూడు పర్యాయాలు పాములు బుసలు కొట్టాయి. నాగుపాములు వస్తుండడంతో స్వేచ్ఛగా పని చేయలేకపోతున్నామని సిబ్బంది సైతం వాపోతున్నారు. ఈ క్రమంలోనే పదిహేను రోజుల వ్యవధిలో మూడు పాములను చంపారు.

భయంతో ఆఫీస్‌కు వస్తున్నాం



నేరెడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయానికి పనిమీద రావాలంటే భయంగా ఉంది. పాములు బాగా వస్తున్నాయి. ఎవరికి పాములు కరుస్తాయోనని భయేస్తుంది. దీంతో చుట్టుపక్కల పదిసార్లు చూసుకుంటూ వస్తున్నం. సొంత భవనం నిర్మిస్తే ఈ బాధ ఉండదు.

– పల్ప శ్రీను, కేతేపల్లి